ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటింగ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్టుమెన్ సివిల్, మెషినిస్ట్, టర్నర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను వచ్చే నెల 24వ తేదీ వరకు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థి యూనిక్ నెంబరు, ఒరిజనల్ సర్టిఫికెట్లను దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మెరిట్‌లిస్టులో ఉన్నవారికి జిల్లాలోని అన్ని ఐటీఐలకు కలిపి చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు పనివేళల్లో చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ అధికారులు లేదా 77999 33370 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్లు గురువారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 2,64,520 మందికి పింఛన్లు అందజేయడానికి అవసరమైన రూ.112.80 కోట్లు జిల్లాకు వచ్చాయి. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7 గంటల నుంచి 11 గంటలలోపు పొరబాట్లు లేకుండా పకడ్బందీగా పింఛన్ల పంపిణీ చేసేందుకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు చేపట్టారు. గత నెలలో వివిధ కారణాలతో పింఛన్ తీసుకోని వారికి ఈ నెలలో మొత్తం పింఛన్ అందజేయనున్నారు. గ్రామ, వార్డు స్థాయిలో జరిగే పింఛన్ల పంపిణీని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు.

ప్రతి పాఠశాలకూ అదనపు ఎస్జీటీలను కేటాయించాలి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండు ఎస్జీటీ పోస్టులు కేటాయించాలని, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:45 ఉండాలని స్కూల్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, నరోత్తంరెడ్డి రాష్ట్ర పాఠశాల విద్య శాఖాధికారులకు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డీఎస్సీలో వచ్చిన వారిని క్లస్టర్‌లో అదనపు టీచర్లుగా నియమించాలని, విద్యార్థులతో నిమిత్తం లేకుండా ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు, సబ్జెక్టులకు ఎస్‌ఏలు పీడీలు కేటాయించాలన్నారు. డైట్, సమగ్రశిక్షలో పనిచేస్తున్న వారిని పూర్తికాలం కాకముందే రీప్యాట్రీషన్ చేశారని, వారికి రానున్న ట్రాన్స్‌ఫర్స్‌లో అనుమతి ఇస్తూ పాత పాఠశాల నుంచి సర్వీసు లెక్కించాలని ఆ ప్రకటనలో కోరారు.

రావి, వేప చెట్లకు కల్యాణం



వెదురుకుప్పం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దామరకుప్పం సమీపంలో బుధవారం శాస్త్రోక్తంగా మహాలక్ష్మి, మహావిష్ణు స్వరూపులైన రావి, వేప చెట్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. పురోహితుడి వేదమంత్రాల నడుమ కల్యాణం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం జరిగింది.

పుల్లూరు అడవి సమీపంలో శవం

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం పుల్లూరు పెద్దచెరువు వద్ద ఓ శవం బయటపడింది. పోలీసుల కథనం మేరకు ఎగువకమ్మకండ్రిగ పంచాయతీ రాణీపురం గ్రామానికి చెందిన కొంతమంది బీడీ తయారీకి ఉపయోగించే తుమికి ఆకుల కోసం బుధవారం అడవికి వెళ్లారు.పుల్లూరు పెద్ద చెరువుకు ఎగువన ఎముకలు తేలిన శవం కన్పించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం రాత్రి స్థానికుల సహకారంతో శవం ఉన్న స్థలానికి వెళ్లి పోలీసులు పరిశీలించారు.ఆ వ్యక్తి రెండు, మూడు నెలల క్రితమే మృతి చెందినట్లు తెలుస్తోంది.స్థానిక వీఆర్‌వో ఇచ్చే ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి, శవానికి పరీక్ష నిర్వహించి, దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ప్రిన్సిపాల్ యుగంధర రెడ్డికి పీహెచ్‌డీ



వి.కోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వి.కోట సీవీఆర్‌ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్‌రెడ్డికి ద్రావిడ విశ్వవిద్యాలయం నుంచి కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న తరహా పరిశ్రమల సమస్యలు, దృక్పథాలు అన్న అంశంపై ఆయన సమర్పించిన వ్యాసానికి డాక్టరేట్ ప్రదానం చేసింది.30 ఏళ్లుగా సీవీఆర్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా యుగంధర్ రెడ్డి పని చేస్తున్నారు. ఆయనకు పీహెచ్‌డీ రావడంపై సహచర అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

విలీన దిశలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు

గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సేవలు యథాతథం



చిత్తూరులోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం-ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు బ్యానర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురువారం నుంచి బ్యాంకుల విలీనంతో జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు కనుమరుగుకానుంది. రాష్ట్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు సహా నాలుగు బ్యాంకులు పనిచేస్తున్నాయి. వీటిని విలీనం చేస్తూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారు. అయితే బ్యాంకు విలీనం ద్వారా ఖాతాదారులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదు. వారి ఖాతా విలీన బ్యాంకు నుంచి ప్రధాన బ్యాంకుకు మారుతుంది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో అకౌంట్ యథావిధిగా కొనసాగుతుంది.బ్యాంకు పేరు మాత్రమే మారుతుంది. పాత చెక్‌బుక్, పాస్‌బుక్, ఏటీఎం కార్డులు, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్, బ్రాంచ్ కోడ్ తదితర సౌకర్యాలు యథాతథంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. గ్రామీణ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 50శాతం వాటా ఉంది. మరో 35 శాతం స్పాన్సర్ బ్యాంకు, మిగిలిన 15 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా కొనసాగుతుంది. 1981లో శ్రీవెంకటేశ్వరా గ్రామీణ బ్యాంకు పేరిట ఏర్పడి గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నరైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తులవారికి రుణాలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రుణాలు అందించే కార్యక్రమం చేపట్టింది. అనంతరం శ్రీవెంకటేశ్వర గ్రామీణ బ్యాంకు కృష్ణా జిల్లా గుడివాడ కనకదుర్గ గ్రామీణ బ్యాంకు విలీనంతో సప్తగిరి గ్రామీణ బ్యాంకుగా 2006 జూన్ 1న ఏర్పడింది. దీని ప్రధాన కార్యాలయం చిత్తూరులో ఉంది.చిత్తూరు, అన్నమయ్య, ఎన్టీఆర్, ఏలూరు, తిరుపతి, కృష్ణాజిల్లాల్లో బ్యాంకుకు 246 శాఖలు ఉన్నాయి. 2025 మార్చి 31 నాటికి రూ. 386.68 కోట్లు నికర లాభాన్ని సప్తగిరి గ్రామీణ బ్యాంకు గడించింది. రూ.26,771.53 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుండగా, డిపాజిట్ల రూపంలో రూ.13,527.59 కోట్లు, రుణాల కింద 13,243.94 కోట్లు వితరణ చేసింది. జిల్లాలవారీగా చిత్తూరులో 68, ఎన్టీఆర్ జిల్లాలో 52, తిరుపతిలో 47, కృష్ణాలో 36, అన్నమయ్యలో 31, ఏలూరులో 12 శాఖలతో బ్యాంకు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇండియన్ బ్యాంకు స్పాన్సర్డ్ బ్యాంకుగా ఉంది. ఇకపై అమరావతిలో ప్రధాన కార్యాలయం, చిత్తూరులో ప్రాంతీయ కార్యాలయంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా అవతరించనుంది. ఇందులో 300 మంది బిజినెస్ కరెస్పాండెంట్లు పనిచేస్తుండగా, 20 లక్షల మంది బ్యాంకు ఖాతాదారులు ఉన్నారు. కాగా ప్రస్తుతం బ్యాంకు చైర్మన్‌గా 2021 ఆగస్టు 23 నుంచి కొనసాగుతున్న ఏఎస్ఎన్ ప్రసాద్ బుధవారం మాతృసంస్థ ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లారు.





బంగారు, వెండి ఆభరణాలను అందిస్తున్న దాత - బంగారు, వెండి ఆభరణాలు, వెండి బిస్కెట్ - కాటేజీ నిర్మాణానికి డీడీని అందిస్తున్న దాత

వరసిద్ధుడికి ఆభరణాల కానుక

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడికి బుధవారం ఆలయ దివంగత ప్రధాన అర్చకులు చంద్రమౌళి గురుకుల్, సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు, అల్లుడు రాఘవేంద్రగురుకుల్ బంగారు, వెండి ఆభరణాలను విరాళంగా అందించారు. అందించిన విరాళంలో బంగారు గాజులు, కమ్మలు, హారం, చైను, ముక్కు పుడకలు వగైరాలు కలిపి 200 గ్రాములున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. వీటితో పాటు 500 గ్రాముల వెండి బిస్కెట్‌ను వితరణ చేసినట్లు ఈవో చెప్పారు. వీటి విలువ రూ.15,00,000 ఉన్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయం వద్ద కాటేజీ నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన వెంకటలక్ష్మి, నరసింహస్వామి, కుటుంబ సభ్యులు ఆలయ వసతి సముదాయంలో కాటేజీ నిర్మాణానికి రూ.6,50,000 డీడీ రూపంలో విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తితే అధికారులదే బాధ్యత

● కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించడంలో, విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలస్థాయిలో సురక్షిత తాగునీటి సరఫరా బాధ్యత ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలదేనని చెప్పారు. వాటర్ ట్యాంకులను నెలకోసారి శుభ్రం చేయాలని, వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులదేనన్నారు. బయోలాజికల్ టెస్టింగ్ చేసి సురక్షిత నీటిని ప్రజలకు అందించే విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వాటర్ ట్యాంకు శుభ్రంచేయని పంచాయతీ సెక్రటరీకి నోటీసులు ఇవ్వాలన్నారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం చేసినట్లు రుజువైతే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకారం



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉషశ్రీ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నా డాక్టర్ అరుణ్‌కుమార్ బుధవారం రిటైరవగా ఆయన స్థానంలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న ఉషశ్రీని నియమించారు. అలాగే చిత్తూరు డీసీహెచ్‌ఎస్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న ఆనంద్‌బాబు కొన్ని నెలల క్రితం రిటైరైనప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది.పదోన్నతుల్లో భాగంగా కావలి ఏరియా ఆస్పత్రిలో ఏవోగా పనిచేస్తున్న సునీత చిత్తూరుకు వచ్చారు.

5మండలాల్లో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. తేమశాతం తగ్గడంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. బుధవారం ఐదు మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా తవణంపల్లెలో 41.7డిగ్రీలు, శ్రీరంగరాజపురంలో 41.2, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 40.6, నగరిలో 40.2 డిగ్రీలతో వడగాల్పులు వీచాయి. బంగారుపాళ్యంలో 39.5, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో 39.1, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 38.8, రొంపిచెర్లలో 38.6, సోమలలో 38.5, గంగాధరనెల్లూరులో 38.4, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం, యాదమరి మండలాల్లో 38.3, సదుంలో 38.2, కార్వేటినగరంలో 37.3, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 36.8, వి.కోటలో 36.4, బైరెడ్డిపల్లెలో 36.3, పలమనేరులో 36.1, పుంగనూరులో 36.0, కుప్పంలో 35.2, రామకుప్పంలో 34.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నమ్మించి.. హతమార్చి

● నగలు, నగదు కోసం మహిళను చంపిన ఐదుగురి అరెస్టు



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అద్దె ఇంటి యజమానితో సఖ్యతగా ఉంటూ.. కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. చివరకు నగలు, నగదు కోసం ఆమెనే హతమార్చారు. తిరుపతిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బుధవారం ఐదుగురు నిందితులను అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 129 గ్రాముల బంగారు నగలు, రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. అనంతపురం జిల్లా నల్లమడ మండలం రెడ్డిపల్లికి చెందిన జగదీష్, ఎర్రావారిపాలేనికి చెందిన హర్షితను ఇటీవల వివాహం చేసుకున్నాడు. తిరుపతి నగరం రాఘవేంద్రనగర్‌లోని రెండో అంతస్తులో ఇంటిని గతనెలలో అద్దెకు తీసుకున్నారు. అదే భవనంలో నాలుగో అంతస్తులో ఇంటి యజమాని శాంతమ్మ ఉంటున్నారు. గతంలో కువైట్ వెళ్లొచ్చిన ఈమె వడ్డీ వ్యాపారం చేసుకుంటున్నారు. ఇద్దరు కుమారులు, కుమార్తె దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో జగదీష్, హర్షిత ఆమెతో సఖ్యతగా, నమ్మకంగా ఉంటూ వచ్చారు. ఆమె వద్ద నగలు, డబ్బు కొట్టేయడానికి వీరిద్దరూ కుట్రపన్నారు. దీనికి తన స్నేహితుడైన మైనర్ బాలుడు, అతడి ప్రియురాలు, మరో స్నేహితుడు ముదిగుబ్బకు చెందిన మురళిని జగదీష్ పిలిపించుకున్నాడు. ఈ నెల 10వ తేది అర్ధరాత్రి శాంతమ్మను నిద్రలేపి మాట్లాడుతున్నారు. నిద్ర మత్తులో, ఆదమరుపుగా ఉన్న ఆమెను చున్నీతో గొంతు నులిమి హత్య చేశారు. ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరేసుకున్నట్లు చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఆమె వద్ద వున్న 129 గ్రాముల బంగారు నగలు, రూ 35 వేలు, రెండు జతల కాలి గొలుసులు తీసుకుని, తమ ఇంటికి వెళ్లారు. 11వ తేది ఉదయం శాంతమ్మ మృతి విషయం బయటకు పొక్కింది. అలిపిరి సీఐ రాంకిషోర్ నేతృత్వంలో ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్ బాబు, క్రైం పార్టీ ఐడీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి విచారించారు. తొలుత అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చచేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక హత్య కేసుగా మార్చారు. నిందితులు తమకేమీ తెలియనట్లుగా నటిస్తూ వచ్చారు. తొలుత మృతురాలి కుటుంబ సభ్యులపై అనుమానంతో విచారించారు. వారి పాత్ర లేనట్లు నిర్ధారణ కావడంతో అద్దెకు ఉంటున్న వారిని విచారించాలని నిర్ణయించారు. అదే రోజు నిందితులు ఇంటికి తాళం వేసుకుని శ్రీకాళహస్తికి వెళ్లారు. సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. వారిని అదుపులోకి తీసుకున్న ఈ క్రమంలో చేసుండటంతో పోలీసుల అనుమానం బలపడింది. హర్షిత, జగదీష్ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య విషయం బయటపడింది. ఈ ఘటనలో బాలుడు, అతడి ప్రియురాలు, మురళి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారినీ అరెస్టు చేశారు. జగదీష్‌పై ఇప్పటికే ఒక హత్య కేసు ఉండగా, హర్షిత తండ్రి వెంకటరమణపై దాదాపు 17 ఎర్రచందనం కేసులు ఉన్నట్లు అలిపిరి సీఐ రాంకిషోర్ చెప్పారు.

'మాంగల్యపూజ' అంటూ ముంచేస్తాడు

● తిరుమలలో మహిళల బంగారు కొట్టేసిన మాయగాడి అరెస్టు



మురుగన్ నాగరాజు

తిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'పుణ్య పుష్కరిణిలో మునిగి రండి. ఆలయం ముందు మాంగల్య పూజ చేస్తాం. మీ భర్తకీ, కుటుంబానికీ మేలు జరుగుతుంది' అని తిరుమలకు వచ్చిన భక్తులను నమ్మించి బంగారంతో ఉడాయించే ఒక ఘరానా మాయగాడిని తిరుమల పోలీసులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. టీటీడీ ఉద్యోగినని చెబుతూ ఇప్పటికే ఇతడు రూ.13 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు కొట్టేసినట్లుగా గుర్తించారు. మదురైకి చెందిన మురుగన్ నాగరాజు అలియాస్ శంకర్‌రావు లీలలు తెలుసుకున్న పోలీసులు నివ్వెరపోయారు. తిరుమల ఆలయ పరిసరాల్లో భక్తి పారవశ్యంలో మునిగి కనిపించే వారిని మురుగన్ ఎంపిక చేసుకుంటాడు. టీటీడీలో పని చేస్తున్నానంటూ పరిచయం చేసుకుంటాడు. తిరుమల క్షేత్ర పవిత్రత గురించి గొప్పగా చెప్పి ఆలయం ముందు మాంగళ్య పూజ చేయించుకుంటే భార్యాభర్తల బంధం గట్టిగా ఉంటుందని నమ్మిస్తాడు. దుకాణాల వద్దకు తీసుకెళ్లి మట్టి గాజులు కొనిస్తాడు. ఒంటిమీదున్న బంగారు ఆభరణాలు తీసేసి.. పుష్కరిణిలో స్నానం చేసి ఆలయం ముందుకొస్తే మాంగల్యపూజ చేస్తామని నమ్మిస్తాడు. అలా పుష్కరిణి స్నానానికి వెళ్లే భక్తుల నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని, పూజకు ఏర్పాట్లు చేస్తానంటూ ఉడాయిస్తాడు. ఇలా మార్చి 29న 40 గ్రాముల బంగారు మంగలసూత్రం, లక్ష్మీడాలర్ చైన్, సెల్‌ఫోన్లు కొట్టేశాడు. మార్చి14న తాను టీటీడీ విజిలెన్స్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌లో పని చేస్తానని చెప్పి కోయంబత్తూరుకు చెందిన శరణ్యను నమ్మించాడు. 80 గ్రాముల బంగారు నగలు తీసుకుని ఆమెను పుష్కరిణిలో మునిగి రమ్మని పంపి పరారయ్యాడు. ఇదేనెల 18న తిరువళ్లూరుకు చెందిన లక్ష్మి నుంచి 12 గ్రాముల బంగారు గొలుసుతో మాయమైపోయాడు. భక్తుల ఫిర్యాదులతో తిరుమల వన్‌టౌన్ ఎస్‌ఐలు చలపతి, రమేష్‌బాబు ప్రత్యేక బృందంగా ఏర్పడి మురుగన్ కోసం గాలింపు ప్రారంభించారు. చెన్నై, మదురై, పుదుచ్చేరి నగరాల్లో క్రైం స్టేషన్లను సందర్శించి పాత రికార్డులను పరిశీలించగా ఇతడి వివరాలు వెలుగులోకి వచ్చాయి. మురుగన్ నాగరాజుపై ఏపీ, తమిళనాడుల్లో 20కిపైగా కేసులున్నట్లు వెల్లడైంది. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఆ మాయగాడిని అరెస్ట్ చేసి, 132 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మురుగన్ నాగరాజు అలియాస్ శంకర్‌రావును తిరుపతి కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించారు.

కరోనా కాలంలో సక్రమంగా జీతాలివ్వని మాట నిజమే

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కరోనా కారణంగా రాష్ట్రానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని నెలల పాటు ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నెలనెలా సక్రమంగా జీతాలు, పింఛన్లు అందని మాట నిజమేనని వైసీపీ విభాగం పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఆ స్థానంలో ఏర్పడే ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగుల విషయంలో ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు.వైసీపీ నేతలు జ్ఞాన జగదీశ్, విజయసింహారెడ్డి, రాజారెడ్డి, దండపాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వీఐపీ బ్రేక్' వేళల మార్పు

తిరుమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన వేళల మార్పు గురువారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 5.30 గంటలకు మొదలై ఉదయం 11 గంటలకు ముగిసేవి. వైసీపీ హయాంలోని టీటీడీ బోర్డు వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 10 గంటలకు మార్చింది. అయినప్పటికీ జనరల్ బ్రేక్ దర్శన భక్తులకు మాత్రం ఉదయం 8 నుంచి 10 గంటల్లోపు.. ఆ తర్వాత ప్రొటోకాల్, రెఫరల్, శ్రీవాణి, ఉద్యోగులకు.. మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రేక్ దర్శనాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన ధర్మకర్తల మండలి తిరిగి బ్రేక్ దర్శనాల్లో మే ఒకటి నుంచి పూర్వపు విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ప్రొటోకాల్, రిఫరెల్, జనరల్ బ్రేక్ దర్శనాలను 7.30లోపు పూర్తి చేసి తర్వాత వీలైనంత మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా టీటీడీ ప్రణాళికలు రూపొందించుకుంది. ఇక సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలనూ మే1 నుంచి రద్దు చేసిన క్రమంలో ఉదయం గంట, మధ్యాహ్నం గంటన్నర అదనంగా సామాన్య భక్తులకు దర్శన సమయం లభించనుంది.

> ఉదయం 5.45: ప్రొటోకాల్ దర్శనం
> 6.30: రెఫరెల్ ప్రొటోకాల్
> 6.45: జనరల్ బ్రేక్
> 10.15: శ్రీవాణి(ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)
> 10.30: దాతలు
> 11.00: టీటీడీ రిటైర్డ్ ఉద్యోగులు
> ● గురు, శుక్రవారాల్లో ఉదయం 8గంటలకు బ్రేక్ దర్శనాలు ప్రారంభం.



ప్రశాంతంగా పాలిసెట్

పాలిసెట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



పలమనేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు,కుప్పం పట్టణాల్లో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసిందని కో-ఆర్డినేటర్ డాక్టర్ మొహమ్మద్ తెలిపారు. పలమనేరులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 1,629మంది విద్యార్థులకు గానూ 1,318 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు.ఆర్డీవో పి.భవానితో పాటు స్పెషల్ స్క్వాడ్ సిబ్బంది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలోనే రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.ఏప్రిల్ 4వ తేది నుంచి చిత్తూరు అర్బో కేంద్రంలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలుచేశారు. బుధవారం నుంచి చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, నగరి, పలమనేరు, కుప్పం, పుంగనూరు, కార్వేటినగరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. కొత్త పద్ధతిలో తొలిరోజైన బుధవారం 201 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, ప్రభుత్వ ఖజానాకు రూ.75.82 లక్షల ఆదాయం సమకూరింది. అత్యధికంగా కుప్పంలో 36, అత్యల్పంగా బంగారుపాళ్యంలో 19 రిజిస్ట్రేషన్లు జరిగాయి. సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల వారీగా చిత్తూరు రూరల్‌లో 33 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.10.29 లక్షలు, బంగారుపాళ్యంలో 19 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.10.93 లక్షలు, నగరిలో 25 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.21.94 లక్షలు, పలమనేరులో 32 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.14.39 లక్షలు, కుప్పంలో 36 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.7లక్షలు, పుంగనూరులో 32 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.6.91 లక్షలు, కార్వేటినగరంలో 24 రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.4.33 లక్షలు ఆదాయం సమకూరింది.ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి మాట్లాడుతూ ఎప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలో ముందుగానే నిర్ణయించుకుని తగిన సమయాన్ని కక్షిదారులు బుక్ చేసుకోవచ్చన్నారు. దీనికి ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్లాట్‌లో కేటాయించిన సమయానికి రాకుంటే 20 నిమిషాల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దవుతుందని, ఇందుకు రూ.200 అపరాధ రుసుము చెల్లించాలన్నారు.



చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ కోసం వేచివున్న కక్షిదారులు

బంగారు దుకాణాలు కళకళ



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా చిత్తూరులో స్వర్ణాభరణాల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. బంగారు ధర పెరిగిన నేపథ్యంలో కొన్ని రోజులుగా కొనుగోళ్లు మందగించడంతో వ్యాపారస్తుల్లో ఆందోళన నెలకొంది. దీంతో అక్షయ తృతీయ సందర్భంగా మహిళలను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ఆఫర్లు ,బహుమతులు ప్రకటించారు. గత సంవత్సరంతో పోలిస్తే 75 శాతం వ్యాపారం జరిగిందని ఓవీసీ జ్యువలరీస్ అధినేత రమేష్ తెలిపారు.బులియన్ మార్కెట్‌లో రోజూ బంగారం రేటు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నందున కొనుగోలుదారులు ఒత్తిడికి లోనయ్యారన్నారు.

సూళ్లూరుపేట కమిషనర్‌కు రివర్షన్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యకు రివర్షన్ ఇస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న చిన్నయ్య పదోన్నతిపై మంగళగిరి మున్సిపాలిటీకి కమిషనర్‌గా వెళ్లగా ఆపై సూళ్లూరుపేటకు కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈయన పదోన్నతిని పునఃపరిశీలించిన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చిత్తూరు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా రివర్షన్ ఇచ్చింది. కాగా సూళ్లూరుపేట మేనేజర్ శ్రీనివాస్‌కు అక్కడ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.



ఎస్పీ, జేసీలతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నీట్ పరీక్షలకు 710మంది విద్యార్థులు

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైద్యకోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించే నీట్ ప్రవేశపరీక్షలు మే 4న జరగనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ మణికంఠ , జేసీ విద్యాధరి, రెవిన్యూ, పోలీసు, విద్య, వైద్య, ఆర్టీసీ, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో 432 మంది, ఎస్.పి. సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో 278 మంది పరీక్షలు రాస్తారన్నారు.పోలీసు ఎస్కార్ట్‌తో ప్రశ్నపత్రాలను పరీక్షాకేంద్రాలకు తరలించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్షాకేంద్రాల వద్ద విద్యార్థుల వెంట వచ్చే తల్లిదండ్రులు, ఇతరులు వేచివుండేందుకు షామియానా, నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు.పరీక్షా కేంద్రం లోపల సీసీ కెమెరాలు, విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్యసేవలకోసం అంబులెన్స్, ఫైరింజన్ సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి పరీక్షాకేంద్రంలో రెవిన్యూ, పోలీసు శాఖల తరపున ఒక నోడల్ అధికారిని నియమించాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఎస్కార్ట్‌తో ప్రశ్నాపత్రాలు తరలించేటప్పుడు పూర్తిస్థాయిలో వీడియో, ఫోటోలు తీయాలని చెప్పారు.డీఆర్వో మోహన్‌కుమార్, డీఈవో వరలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

గౌనిచెరువుకు ఏనుగులొచ్చాయ్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం బంగారుపాళ్యం మండలం గౌనిచెరువులోకి రెండు ఏనుగులు వచ్చాయి.వేసవితాపానికి తట్టుకోలేక సమీప అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు మొగిలి సమీపంలోని గౌనిచెరువులోకి మంగళవారం సాయంత్రం వచ్చాయి.కాసేపు జలకాలాడి తిరిగి అటవీ ప్రాంతానికి వెళ్లే క్రమంలో కాసేపు బురదలో చిక్కుకుపోయాయి. బయటపడే ప్రయత్నంలో ఘీంకారాలు చేయడాన్ని స్థానికులు ఫోన్లతో దూరం నుంచి వీడియోలు తీశారు. ఈ వీడియోలు చూసిన కొంతమంది ఏనుగులు బురదలో కూరుకుపోయి బయటపడలేక ఇబ్బంది పడుతున్నాయని ప్రచారం చేశారు.



నిఘా నేత్రాలు...

నేరగాళ్లకు ముకుతాళ్లు

- జిల్లాలో 3వేల సీసీ కెమెరాల ఏర్పాటు
- మరిన్ని చోట్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు



చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యంతో నాలుగువేల కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు మూడు వేల కెమెరాలను ఏర్పాటు చేయగలిగింది.వీటి ఉపయోగంపై ప్రజల్లో అవగాహనకు పోలీసులు సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు.దొంగతనాలను, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్రను వివరిస్తున్నారు.రాత్రి సమయాల్లో జరిగే సంఘటనలపై అనుమానాస్పద వ్యక్తులను గుర్తించేందుకు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించేందుకు సీసీ కెమెరాల విజువల్స్ ప్రధానంగా ఉపయోగపడుతున్నాయి.

ఇప్పటికే చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి, జీడీ నెల్లూరు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ప్రధాన కూడళ్ళ, అంతర్రాష్ట్ర సరిహద్దులు, మార్కెట్లు, దుకాణ సముదాయాలు, అపార్టుమెంట్లు, ఆస్పత్రులు, బ్యాంకులు, పాఠశాలలు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇప్పటికే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కార్పొరేట్ సంస్థల సహకారంతో మరిన్ని చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

● స్మార్ట్ డోర్ లాక్‌తో ప్రయోజనమిదీ...

ఇళ్ల వద్ద భద్రతను పెంచేందుకు సీసీ టీవీ కెమెరాలను ప్రతిపాదిస్తున్న పోలీసులు స్మార్ట్‌డోర్ తాళాలను అందించి ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 16,500 స్మార్ట్‌తాళాలను ప్రజలకు అందించారు.ఈ స్మార్ట్‌లాక్స్ దొంగతనాలను నిరోధించడంతో పాటు భద్రతపై అవగాహనను పెంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. స్మార్ట్‌లాక్ సాధారణ తాళానికి భిన్నమైంది. ఎవరైనా అనుమతి లేకుండా తలుపును తెరవడానికి ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగి హెచ్చరిస్తుంది.వెదర్ ప్రూఫ్ సాంకేతికతతో తయారైన స్మార్ట్‌లాక్ పనిచేసే విధానంపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.ప్రస్తుత వేసవి సెలవుల్లో ఎవరైనా ఊర్లకు వెళుతుంటే మీ ఇంటి భద్రత కోసం లాక్డ్ హౌసెస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను అమర్చుకోవాలని లేదా స్థానిక పోలీసు స్టేషన్లలో సమాచారం ఇచ్చి వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు.ఎల్‌హెచ్‌ఎంఎస్ వ్యవస్థ తాళం వేసిన ఇళ్ల నిరంతర నిఘాలో వుంటాయి. ఈ సిస్టం ఉన్న ఇళ్లలో అపరిచితులు ప్రవేశించే ప్రయత్నం చేస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్లకు అలెర్ట్ కాల్ వెళుతుంది.దీంతో పోలీసులు స్పందించి దొంగలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునే అవకాశం ఉంటుంది. ఈ సేవను పొందేందుకు ప్రజలు చేయాల్సిందల్లా వారి స్మార్ట్ ఫోన్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ బై ఏపీ పోలీస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇంటి వివరాలను నమోదు చేయడమే.



చిత్తూరులోని పలమనేరు రోడ్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

విచారణ అధికారులపైనే విచారణ

తీవ్ర జాప్యమే కారణం - నెలరోజుల్లో నివేదికకు ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టరేట్‌లోని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో) కార్యాలయంలో పనిచేస్తుండిన ఒక ఉద్యోగిపై విచారణ జరిపి నివేదిక అందించడంలో తీవ్ర జాప్యం చేశారన్న కారణంపై విచారణ అధికారులపైనే విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. స్థానిక సీపీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండిన పి. శశికర్ విధులకు గైర్హాజరు కావడంపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు నమోదు చేయడంలో ముగ్గురు అధికారులు అసాధారణ జాప్యం చేసినట్లు ప్రభుత్వం గుర్తించింది. దాంతో అప్పటి సీపీవో కార్యాలయ జాయింట్ డైరెక్టర్ సీహెచ్‌వీఎస్ భాస్కర్ శర్మ, మాజీ సీపీవో డి. ఆనంద నాయక్, మాజీ సీపీవో (ఎఫ్ఏసీ) ఎల్. అప్పలకొండలపై సమగ్ర విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ (ఎం&ఆర్) డైరెక్టర్ ఆర్. రాంబాబు, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎం. మోహన్‌రావులను విచారణ అధికారులుగా నియమించింది. నెలరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ముగ్గురు అధికారుల్లో భాస్కర్ శర్మ ఇదివరకే రిటైరవగా, ఆనంద్ నాయక్ ఈ ఏడాది జూన్ 30న రిటైర్ కానున్నారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

జిల్లాకు 916 యూనిట్ల కేటాయింపు ● 25లోగా దరఖాస్తులకు ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మొన్న బీసీ కార్పొరేషన్... నిన్న ఎస్సీ కార్పొరేషన్లకు సబ్సిడీ రుణాలను మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మైనార్టీలకు కూడా సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది.బీసీ కార్పొరేషన్ కింద మంజూరైన లబ్ధిదారులకు గ్రౌండింగ్ ప్రక్రియ మొదలుకాగా... ఎస్సీ కార్పొరేషన్‌లో రుణాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటున్నారు. తాజాగా జిల్లాలోని ముస్లిం మైనార్టీలకు రూ.14.09 కోట్ల విలువైన 916 యూనిట్లను కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదికాకుండా క్రిస్టియన్ మైనార్టీలకు రూ.9.50 లక్షల విలువ కలిగిన ఐదు యూనిట్లను కేటాయించింది. జనాభా ప్రాతిపదికన జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలకు ఆయా ప్రాంతాల బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించారు.

అర్హతలు : తెల్లరేషన్ కార్డు కలిగిన ముస్లిం, క్రిస్టియన్లు అర్హులు.ఆధార్‌కార్డు కలిగి ఉండాలి. లక్ష్యం నిర్దేశించిన బ్యాంకు పరిధిలో నివాసముండాలి.లబ్ధిదారుల వయస్సు 21-55 మధ్య ఉండాలి.మైనార్టీ అభ్యర్థులు తహసీల్దార్ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం (బీసీ-ఇ, బీసీ-బి, ఓసీ-ముస్లిం) ఉన్న వారు అర్హులు. క్రిస్టియన్ మైనార్టీలకు తహసీల్దార్ జారీచేసిన(బీసీ-సి. ఓసీ-సి) ధ్రువీకరణ పత్రం లేదా గుర్తింపు పొందిన చర్చిల నుంచి బాప్తిజం పొందినట్లు ధ్రువీకరణ కలిగి ఉండాలి.ఆసక్తి కలిగిన ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో వచ్చే నెల 25వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరినాథరెడ్డి బుధవారం తెలిపారు.



వైభవంగా గంగమ్మ జాతర ప్రారంభం



గంగమ్మ జాతర ప్రారంభంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీధర్

పలమనేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో బుధవారం మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గంగ చాటుతో గంగజాతర వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యని ర్వాహక అధికారి కమలాకరరావు, పలమనేరు గంగమ్మ జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీధర్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ మే 17 వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతా యని.. రోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం చేపడుతున్నట్లు తెలి పారు. మే 14న రాత్రి గంగమ్మ శిరస్సు ఊరేగింపు, 15న గంగమ్మ విశ్వరూప ద ర్శనం, 16న అమ్మవారి జలది ఉత్సవం వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ ఏర్పాట్లు చేపడుతుందని తెలిపారు.

సీహెచ్‌వో అనురాధకు ఘనసన్మానం



అనురాధ దంపతులను సన్మానిస్తున్న వైద్యాధికారి విజయచందర్ తదితరులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సీహెచ్‌వోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అనురాధను బుధవారం వైద్యాధికారి విజయచందర్, వైద్యసిబ్బంది ఘనంగా సన్మానించారు. స్థానిక రాయల్‌మహల్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి విజయచందర్ మాట్లా డుతూ గత 41 సంవత్సరాలుగా వైద్యశాఖలో సేవలందించిన సీహెచ్‌వో అను రాధ విధి నిర్వహణలో మంచిపేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. ఈ సంద ర్భంగా అనురాధ, చిన్నికృష్ణ దంపతులను వైద్యసిబ్బందితో పాటు పలువురు సత్కరించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ అరుణ్‌కుమార్, శాలిని, పద్మావతి, పశువైద్యాధికారులు డాక్టర్ చందనప్రియ, సాయికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె తహసీల్దార్‌గా ప్రసన్నకుమార్



బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె తహసీ ల్దార్‌గా ప్రసన్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మాధవరాజు గంగ వరానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రసన్నకు మార్ బాధ్యతలు చేపట్టారు.

వేసవి తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి తులసీనాయక్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలు వేసవి విజ్ఞాన తరగ తులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి తులసీనాయక్ కోరారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో విద్యా ర్థులకు వ్యాస రచన, సంగీతం, నృత్యం, చెస్ వంటి క్రీడలు తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ సైనిక ఉద్యోగి హరి, న్యాయవాది గిరిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు బస్సుషెల్టర్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదనపల్లె మార్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుషెల్టర్‌ను ఏర్పాటు చేయాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాల యంలో తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ గతంలో పట్ట ణంలో మదనపల్లె వెళ్లే ప్రయాణికుల కోసం రెండు బస్సు షెల్టర్లు ఉండేవని, అలాగే ఎంపీడీవో కార్యాలయం వద్ద పెద్ద చెట్లు ఉండటంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేదన్నారు. ప్రస్తుతం బస్సు షెల్టర్లు, చెట్లు తొలగించడం తో ప్రయాణికులు ఎండకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు నరసింహులు, నాగరాజ, వెంకటర మణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

చౌడేపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం లో భక్తులకు అన్నదానం చేయడానికి బుధవారం రూ. 2,04,375 విరాళం అందినట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. మదనపల్లెకు చెందిన మురళీనాయుడు, గిరిశ్రీ దంపతులు రూ.1,34,675 విరాళం అందించగా.. వెంకటశివారెడ్డి, పంచరత్నమ్మలు రూ.50 వేలు, బెంగళూరుకు చెందిన గంగులప్ప 20 వేలు అందించారని పేర్కొన్నారు. దాతలను దర్శనం అనంతరం సన్మానించారు.

ఘర్షణలో మహిళకు గాయాలు

పలమనేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దారి కోసం తలెత్తిన వివాదంతో పర స్పరం దాడులు చేసుకొన్న సంఘటనలో మేరి అనే మహిళ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. బైరెడ్డి పల్లి మండలం జంగాల అగ్రహారం గ్రామానికి చెందిన మేరి ఇంటివద్ద నెల కొన్న దారి సమస్యపై పొరుగింటి గీతాశేఖర్ బుధవారం మాటామాటా పెంచు కొని ఒకరికొకరు కొట్టుకొన్నారు. ఈ ఘర్షణలో మేరి అపస్మారక స్థితిలో పడిపో వడంతో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జౌకొత్తూరులో గంగమ్మకు పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరడి గుంట పంచాయతీ జౌకొత్తూరులో నూతనంగా నిర్మించిన బోయ కొండ గంగమ్మ ఆలయంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ప్రజాప్రతిని ధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కూటమి నాయకులు మాధవరెడ్డి, చైతన్యరాయల్, గంగాధర్ పూజలు నిర్వహించారు.

● గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్‌లో వెలసిన మలాలమ్మ దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. పూజా కార్యక్రమాలకు పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్ర మంలో గంగవరం జడ్పీటీసీ పార్వతి, చంద్రప్ప, బైరెడ్డిపల్లె కృష్ణ మూర్తి, హేమంత్‌కుమార్ రెడ్డి, చెంగారెడ్డి, ప్రహ్లాద, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు రెడ్డి, కోదండరామయ్య, శ్యామ్, నరేష్, గంటావూరు శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాభారత ఉత్సవాలు

గుడుపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామగా నిపల్లెలో నెలకొన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహా భారత వార్షిక బ్రహ్మోత్సవాలు మే 2 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్స వాల్లో భాగంగా 2న అంకురార్పణ, 3న భూతరాజు కథ, 4న యయాతి చరిత్ర, 5న శంతన చరిత్ర, 6న పాండవ విదురోత్పత్తి, 7న పాండవ కౌరవ జననం, 8న పాండవ కౌరవ బాల్య క్రీడలు, 9న ద్రౌపదీ జననం, 10న బకాసుర వధ, 11న ద్రౌపదీ కల్యాణం, 12న నలాహిని చరిత్ర, 13న సుభద్రా కల్యాణం, 14న రాజసు యాగం, 15న అర్జున తపస్సు, 16న కీచక వధ, 17న రథోత్సవం, 18న ఇలావంతుని బలి, 19న దుర్యోధన వధ, 20న ధర్మరాజు పట్టాభిషేక ఉత్సవం జరుగుతుందన్నారు. రోజూ నాటకాలు, ఉత్స వాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో అన్నదానం ఉంటుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దిగువ పోకలవారిపల్లి పంచాయతీ ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాల య్యాయి. కల్లూరు పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన సందీప్, సుదర్శన్‌రెడ్డి, ముఖేష్ ద్విచక్ర వాహ నంలో పీలేరు నుంచి కల్లూరు వైపు వస్తున్నారు. కుప్పం నుంచి పీలేరుకు వెళుతున్న కారు ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎదు రుగా రహదారిపై ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద ద్విచక్ర వాహ నాన్ని ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రు లను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

సోమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో క్షేత్రస్థా యిలో ఉత్తమ సేవలు అందించడంతో ప్రజలే సన్మానించడం అభి నందనీయమని కందూరు వైద్యాధికారులు డాక్టర్ నీలిమా, డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం కందూరు పీహెచ్‌సీలో పీహెచ్ ఎన్ (పబ్లిక్ హెల్త్ నర్సు) విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన రహీమాను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేసి ఆమె ఉత్తమ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సోమల, పెద్దఉప్పరపల్లె వైద్యాధికారులు డాక్టర్ జయసింహ, బాలాజీ, సీహెచ్‌వో అమరనాథ్ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కురవపల్లెలో దాహార్తి తీరింది

సోమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం తమ్మి నాయనపల్లె పంచాయతీ కురవపల్లెలో గత కొద్ది రోజులుగా తాగు నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలోనే గ్రామ ప్రజలు అధికారులకు విన్నవించడంతో బుధవారం నూతన బోరు డ్రిల్లింగ్ చేయడంతో నీరు పుష్కలంగా పడ్డాయి. కార్యక్ర మంలో ఎంపీడీవో నారాయణ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, చంద్రయ్య, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి మృతి



మృతిచెందిన మునీంద్ర

పలమనేరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తాటికాయల కోసం చెట్టు ఎక్కి ప్రమాద వశాత్తు కాలు జారి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పలమ నేరు మండలంలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పలమనేరు సమీపం లోని మేలుమాయి క్రాస్‌లో నివాసం ఉంటున్న సుబ్రమణ్యం కుమారుడు మునీంద్ర(34) పెద్దపంజాణి మండలం శివాడి గ్రామంలో జాతర జరుగుతోందని సమీప బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం తాటికాయల కోసం శివాడి గ్రామ సమీపంలోని తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో చెట్టుపై నుంచి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆటోలో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మునీంద్ర మృతిచెందాడు.

పరిధికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల వైద్యాధికారి జె.ఎస్ బాబు హెచ్చరించారు. బుధవారం స్థానిక ఆర్‌ఎంపీలు, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఆర్‌ఎంపీలు, పీఎం పీలు కాన్పులు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. నిబంధ నలు ఉల్లంఘించి వైద్య సేవలు అందిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్లు ఇష్టారాజ్యంగా రక్త పరీక్షలు, స్కానింగ్‌ల పేరుతో ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యా దులు వస్తున్నాయన్నారు. ప్రజలకు సేవ చేయడానికి సహకరిం చాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పీఎంపీ అధ్యక్షులు శ్రీనివాసు లునాయుడు, ఉపాధ్యక్షుడు అప్పిరెడ్డియాదవ్, జిల్లా నాయకులు అమరనాథ్, శ్రీనివాసులు, ఈశ్వరమ్మ, సురేష్‌నాయుడు, నారాయ ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పులిహోర ప్యాకింగ్ యంత్రం ప్రారంభం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పోటులో తయారు చేసే పులిహోరను ప్యాకింగ్ చేసే అధునాతన యంత్రాన్ని బుధ వారం ఏఈవోలు రవీంద్రబాబు, హరమాధవరెడ్డి ప్రారంభించారు. ఉదయం యంత్రానికి వారు పూజలు నిర్వహించి ప్రారంభించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

డిజిటల్ లిటరసీతో మహిళల అభ్యున్నతి



మహిళలకు కిట్లు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సాధారణ అక్షరాస్యతే కాకుండా నేడు డిజిటల్ లిటరసీని సాధించినప్పుడు ఆ ప్రాంత మహిళల అభ్యు న్నతి సాధ్యమవుతుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పం మండల సచివాలయంలో బుధవారం కడా ఆధ్వర్యంలో ఫ్రంటియర్ మార్కెటీర్స్ సంస్థ నుంచి మహిళలకు శిక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పం ప్రాంత అభివృద్ధితో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక ప్రణాళి కలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అందులో ఫ్రంటియర్ మార్కెటీర్ సంస్థ ద్వారా మహిళ లకు అందిస్తున్న శిక్షణ ఒక భాగమన్నారు. మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి .. వారి కుటుంబాలను బహుముఖాభివృద్ధిని చేయడం ముఖ్యమంత్రి ఆశయమని పేర్కొ న్నారు. మహిళలు డిజిటల్ లిటరసీని పెంచు కుని, సాంకేతిక పద్ధతుల వినియోగం నేర్చుకుని ఆర్థికంగా పైకి ఎదగాలని ఆకాంక్షించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జనసేన నియో జకవర్గ ఇన్‌చార్జి నరేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశే ఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కవులకు శ్రీశ్రీ మార్గదర్శకుడు



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు

గంగవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక కవులకు శ్రీశ్రీ మార్గదర్శకులని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీ నాథం నాయుడు పేర్కొ న్నారు. బుధవారం శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని స్థానిక కళామందిరంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీశ్రీ రచించిన 100 పుస్తకాలను ఆయన చిత్రపటం ఎదుట ఉంచి కవితల గొప్పతనాన్ని వివరించారు. నేటితరం కవులు శ్రీశ్రీని ఆదర్శంగా తీసు కొని విలువలతో కూడిన కవితలను రూపొందించాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, దామో దర్ నాయుడు, జమున, రోజా, భార్గవి, ప్రీతమ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

మనోవేదనతో వ్యాపారి ఆత్మహత్య

గంగవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మనోవేదనతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గంగవరం మండ లంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... గంగవరం మండలం మారేడుపల్లె గ్రామానికి చెందిన వెంకటేష్ ఫొటో ఫ్రేమ్‌లు పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడు నెలల క్రితం వెంకటేష్ కుమారుడు కిరణ్ బీడీఎస్‌లో కర్ణాటకలో గోల్డ్‌మెడల్ సాధించాడు. అయితే కొద్ది రోజులకే కిరణ్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. కుమారుడు మృతి చెందినప్పటి నుంచి వెంకటేష్ బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వెంకటేష్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఇంతలోనే గ్రామస మీపంలోని కౌండిన్య కాలువ వద్ద ఓ చింతచెట్టుకు వేలా డుతూ కనిపించాడు. గ్రామస్తులు కుటుంబసభ్యులు చేరు కోగానే అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స.హ.చట్టం బోర్డులో పేర్లు గందరగోళం



తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులో మారని పేర్లు

చౌడేపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అధికారులు మారినా స.హ.చట్టం బోర్డులో పేర్లు మాత్రం మారక పోవ డంతో స్థానిక రెవెన్యూ అధికారుల నిర్ల క్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. తహసీ ల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచారం హక్కు చట్టం బోర్డులో అధికారుల వివరాలు, ఫోన్ నంబర్లు, ఎవరికి దరఖాస్తు చేయాలన్న వివరా లతో అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అయితే కార్యాలయం ముందే ఉన్న బోర్డులో పౌరసమాచార అధికారిగా డీటీ మాధవి పేరు ఉంది. అయితే ఆమె 2 నెలలకు ముందు సెలవుపై వెళ్లిపో యారు. ఆ స్థానంలో డీటీగా బదిలీపై నందిని బాధ్యతలు తీసుకున్నా.. బోర్డులో మాత్రం పేరు, ఫోన్ నంబరు మారడం లేదు. అలాగే సమాచార అప్పిలేట్ అథా రిటీ అధికారిగా పలమనేరు రెవెన్యూ డివి జన్ అధికారి మనోజ్‌రెడ్డి పేరు అలాగే ఉంది. ఆయన 6 నెలల క్రితమే బదిలీ కాగా ఆర్డీవో భవాని బాధ్యతలు స్వీకరిం చారు. అధికారులు బదిలీ అయినా బోర్డుల్లో పేర్లు, ఫోన్ నంబర్లను మార్పు చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇక నైనా అధికారులు స్పందించి చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

● రాష్ట్ర దళిత సంఘ నాయకులు



అంబేడ్కర్ ఆశయ సాధనకు సంఘీభావం తెలుపుతున్న దళిత నాయకులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు దళితులు కలిసికట్టుగా కృషి చేయాలని దళిత సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మహాసముద్రం దళితవాడలో విశ్రాంత ఉద్యోగి మహాసముద్రం కృష్ణన్ అధ్యక్షతన 134వ అంబే డ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షులు తుల్లిబల్లి అశోక్‌బాబు, రాయలసీమ మాలమహానాడు అధ్యక్ష, కార్యదర్శులు యమలా సుదర్శ న్, పూతలపట్టు ప్రభాకర్, ఎన్జీవో సంఘ అధ్యక్షుడు రాఘ వులు, మూర్తి, రమేష్ పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణను ప్రతి దళితుడి బాధ్య తగా స్వీకరించాలన్నారు. వర్గీకరణ, క్రిమిలేయర్ రాజ్యాంగ వ్యతిరేకమని వారు అన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగిస్తూ ఆయన ఆశయ సాధ నకు కృషి చేద్దామంటూ నినాదాలు చేశారు. గ్రామంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు దుగ్గాని జయరాం, రాజకుమార్, వళ్లత్తూరు ఉదయ్‌కు మార్, పార్థసారథి, జానకిరామన్, నాయకులు, అభిమా నులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



జీవీ రమణను సన్మానిస్తున్న నాయకులు

సదుం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అర్హు లైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందుతాయని.. సంక్షేమ పథకా లను సద్వినియోగం చేసుకోవాలని గిరి జన సంఘ జిల్లా నాయకులు జీవీ రమణ సూచించారు. స్థానిక భట్టువారిపల్లెలోని డిప్యూటీ ఇంజనీరు కార్యాలయంలో బుధ వారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం అభివృద్ధిపై జిల్లా అధ్యక్షులు హరి శివప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎద గాలన్నారు. పిల్లలను కసూర్బా, గురు కుల, నవోదయ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత చదువులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మహే శ్వర రావు, చిత్తూరు రవి, వెంకట్రావు, మేఘన, కళ్యాణి, శంకర, అనూరాధ, ప్రసాదరావు, హరి, మునిరాజా, భానుప్ర కాష్ పాల్గొన్నారు.

వరదరాజస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం



వరదరాజస్వామి ఆలయంలో నిర్వహించిన అన్నకూటోత్సవం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 30(ఆంధ్ర జ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయంలో బుధవారం అన్నకూటోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. అక్షయ తృతీయ రోజున ఈ కార్య క్రమాన్ని ఆలయంలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమానికి కాకర్లవా రిపల్లెకు చెందిన పట్టాభి నాయుడు దాతగా వ్యవహరించారు. ఉదయం ఆల యంలో వరదరాజస్వామికి ఘనంగా అభిషేకం నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలకు విశేషపూజలు నిర్వహిం చారు. ఉత్సవ విగ్రహాల ఎదుట అన్న ప్రసా దాన్ని రాశిగా పోసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, దాతలు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహుడికి ప్రత్యేక పూజలు



లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కల్లూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పులి చెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చ నలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీ నరసిం హస్వామి భక్తులకు విశేషంగా దర్శనమి చ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చ కులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసా దాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పల్లకిలో శివపార్వతుల విహారం

సోమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం శివ పార్వతుల ఉత్సవమూర్తులను పట్టణంలోని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ నేప థ్యంలో ఆలయంలో ఉదయం బుంగావారి పల్లె, గన్నావారిపల్లెకి చెందిన శెట్టివారి కుటుంబ సభ్యులు ఉభయదారుల ఆధ్వ ర్యంలో అభిషేకపూజలు చేపట్టారు. రాత్రి శివ పార్వతుల ఉత్సవమూర్తులను పల్లకిలో అలం కరించి ఊరేగించారు. కార్యక్రమాలను ఉభయ దారులు శెట్టివారి సదాశివయ్య, రామచం ద్రయ్య, అశోక్, రెడ్డెప్ప, శివమూర్తి తదితరులు పర్యవేక్షించారు.



స్వయంభేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు

ఘనంగా భసవేశ్వరస్వామి జయంతి



పూజలందుకున్న భసవేశ్వరస్వామి

పెద్దపంజాణి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తుకూరు గ్రామంలో వెల సిన భసవేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న దానం చేశారు. వీరశైవ లింగాయతులు, జంగమ కుటుంబ సభ్యులు, పలమనేరు, పుంగనూరు నియో జకవర్గాలలోని సంఘ నాయకులు దాదార్ నాగరాజ్ గౌడ, మనోహర్, నాగరాజు, మల్లేష్, ప్రవీణ్ కువనార్, చంద్రశేఖర్‌గౌడ, వీరేగౌడ, మంజు నాథ్, సుకుమార్, పరమేశ్వర్ తదిత రులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

● దళిత సంఘ నాయకులు



సంఘీభావం తెలుపుతున్న దళిత నాయకులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు దళితులు కలిసికట్టుగా కృషి చేయాలని దళిత సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మహాసముద్రం దళితవాడలో విగ్రహ ఉద్యోగి మహాసముద్రం క్రిష్ణన్ అధ్యక్షతన 134వ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షులు తుల్లి బల్లి ఆశోక్‌బాబు, రాయలసీమ మాలమహానాడు అధ్యక్ష, కార్యదర్శులు యమలా సుదర్శన్, పూతలపట్టు ప్రభాకర్, ఎస్సీఎస్ సంఘ అధ్యక్షుడు రామ వులు, మూర్తి, రమేష్ పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగాను ప్రతి దళితుడి బాధ్యతగా స్వీకరించాలన్నారు. పల్లెకరు, క్రిమిలేయర్ రాజ్యాంగ వ్యతిరేకమని వారు అన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామంటూ నినాదాలు చేశారు. గ్రామంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు దుర్గాని జయరాం, రాజకుమార్, వళ్లత్తూరు ఉదయ్‌కుమార్, పార్థసారధి, జాన కిరామన్, నాయకులు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

యూకో బ్యాంకు ఏటీఎం ప్రారంభం



ఏటీఎంను ప్రారంభిస్తున్న ఏపీఎం నాగరత్న

ఐరాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యూకో బ్యాంకు లబ్ధిదారుల సౌకర్యార్థం బ్యాంకు ప్రాంగణంలో ఏటీఎంను ప్రారంభించినట్లు మేనేజర్ బాపుచందర్, ఏపీఎం నాగరత్న తెలిపారు. బుధవారం బ్యాంకు వద్ద ఏటీఎంను ఏపీఎం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇన్ని రోజుల వరకు ఏటీఎం లేక కొంత ఇబ్బందిపడ్డారన్నారు. డబ్బు డ్రా చేయడంతో పాటు నగదును జమ చేసే విధంగా యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి లబ్ధిదారుడు దీనిని వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో యూకో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు



కుంభ జలం తీసుకొస్తున్న దాతలు

పాలసముద్రం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణజమ్మాపురంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరుడు, నవగ్రహాలు, ముఖద్వారానికి బుధవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయ యాగాలలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కోలాటాలు వేశారు. మండల వాసులతో పాటు, తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

కష్టపడే వారికే పదవులు



మాట్లాడుతున్న సునీల్‌కుమార్ చౌదరి

గుడిపాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కష్టపడి పనిచేసే వారికే పదవులు దక్కుతాయని టీడీపీ చిత్తూరు నియోజకవర్గ పరిశీలకుడు సునీల్‌కుమార్ చౌదరి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్ రాజ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పర్యవేక్షణలో పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మండలంలోని నరసింహాపురం ఏరుకోపురం, పాపరాయునిపల్లె మెళ్లెపల్లి పంచాయతీలో పరిశీలన చేశారు. దీనిపై వెంగమాంబాపురం, కమ్మతిమ్మాపల్లె, క్రిష్ణా జమ్మాపురం, కుప్పిగాని పల్లె గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 197 రామాపురం పంచాయతీలో కొన్ని కారణాల వలన కమిటీ ఎన్నికను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుర్రప్ప నాయుడు, టీడీపీ నాయకులు బలరామ్, విజయ్, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, రమునాథ నాయుడు, హరిబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేని సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రీ సర్వేని సద్వినియోగం చేసుకుని, భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. బుధవారం వనదుర్గాపురంలో రీసర్వే పనులను ప్రారంభించి, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాజీ వివాద రీసర్వేలో భూముల కొలతలు పూర్తిగా చేస్తామని, రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ ప్రవీణ్, మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు వెంకటాచలం, తంగరాజ్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR.
I.P.No. 05 of 2025

Between:
C. Selvam ..... Petitioner.
And:
1) K. Sreedhar , 2) K. Murali, 3) Munaswamy .....Respondents.

NOTICE TO THE RESPONDENT
Nos. 1 to 3

1) K Sreedhar, S/o K. Gurunadha Chetty, residing at Thavanampalle village and post,Thavanampalle Mandalam, Chittoor town and District,A.P.
2) K. Murali, S/o S.Kumaraswamy, r/at Sivasakthi Nagar, Santhapet, Chittoor town and District A.P.
3) Munaswamy, S/o not known, residing at D.No. 15-962, Vinyakapuram, Kondamitta, Chittoor town and District A.P.

Please take notice that the above I.P. filed by the Petitioner against the Respondents, declaring the Petitioner as an insolvent and the same is posted to 20-6-2025 for your notice. Please be present on the said date at 10-30 A.M either in person or through an Advocate and to raise your objections if any. failing which the matter will be decided in your absence as exparte.
Hearing date: 20-6-2025
(By Order of The Hon'ble Court)

Sd/- T.SIVANANDAM
Advocate,Chittoor.
Cell No: 9440592212

అగస్త్యేశ్వర స్వామి ఆలయ రథం తయారీకి చర్యలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయ అధికారులు స్వామి వారి రథం తయారీకి చర్యలు చేపట్టారు. దాదాపు రూ.50లక్షలతో ఆధ్యాత్మిక రథం తయారీకి బుధవారం భక్తులతో కలిసి సలహా సమావేశం నిర్వహించారు. అనంతరం తంజావూరు కళాకారులతో రథం తయారీలో అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. 2026 సంగని మాస వార్షిక బ్రహ్మోత్సవాలకు స్వామివారికి రథం తయారు చేయాలని సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

పులిహోర ప్యాకింగ్ యంత్రం ప్రారంభం



పులిహోర ప్యాకింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈవోలు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పోటులో తయారు చేసే పులిహోరను ప్యాకింగ్ చేసే ఆధునాతన యంత్రాన్ని బుధవారం ఏఈవోలు రవీంద్రబాబు, హరమాధవరెడ్డి ప్రారంభించారు. ఉదయం యంత్రానికి వారు పూజలు నిర్వహించి ప్రారంభించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎస్‌వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న బాలాజీ నాయుడు, నిర్వాహకులు

గుడిపాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురంలో బుధవారం మహాభారత యజ్ఞాన్ని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని వంశపారంపర్య ధర్మకర్త బాలాజీ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి ద్రౌపది అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం శిలలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరికథ కార్యక్రమం నిర్వహణకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రూ.లక్ష విరాళంగా అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కమలేనాథన్పిళ్లై, జయచంద్రపిళ్లై కుటుంబ సభ్యులు దాతలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, వసంతాపురం సర్పంచ్ రజని, ఎంపీటీసీ విజయలక్ష్మి, మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం

నిండ్ర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నిండ్ర డిప్యూటీ మండల పరిషత్ అధికారి లక్ష్మీపతి పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఒక ప్రైవేటు భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీరాజ్ అధికారి (డీపీవో) సుధాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మీపతి సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో...

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం డిప్యూటీ తహసీల్దార్ కోమల సేవలు అభినందనీయమని వెదురుకుప్పం తహసీల్దార్, తిరుపతి రూరల్ డిప్యూటీ తహసీల్దార్ జయంత్‌కుమార్ అన్నారు. బుధవారం వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన డిప్యూటీ తహసీల్దార్ కోమలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు, అఖిలపక్ష పార్టీ నాయకులు ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఆమె సేవలను వక్తలు కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తవణంపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు డివైడర్ ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని దిగువత్తూరు గ్రామానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం(55) కాణిపాకం సమీపంలోని బెంగళూరు-తిరుపతి హైవే సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో చొక్కలింగం తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు తరలించి మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డుపై పడ్డ మినీ వ్యాను

● త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడ్డ మినీ వ్యాన్

పూతలపట్టు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అంగడి సరుకులతో వెళ్తున్న ఓ మినీ వ్యాను అకస్మాత్తుగా రోడ్డుపై బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పాకాల నుంచి ఓ మినీ వ్యాను అంగడి సరుకుల లోడుతో బందపల్లికి వెళ్తుండగా, బందపల్లి హైవేపై వద్ద మినీ వ్యాన్ టైరుకు అకస్మాత్తుగా పంక్చర్ కావడంతో రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ వ్యానులో వున్న ముగ్గురు వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

టీడీపీ నేతకు పలువురి నివాళి



చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆచారి మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలోని చంద్రశేఖర్ స్వగృహానికి బుధవారం సాయంత్రం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. జాకీర్, రఘు, త్యాగరాజులు, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లకిలో శివపార్వతుల విహారం

సోమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. ఉదయం బుంగాపాలెం సర్పంచ్ రవీంద్ర కిశోర్ కుటుంబ సభ్యులు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేపట్టారు. రాత్రి శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకిలో అలంకరించి ఊరేగించారు.

వరదరాజస్వామి ఆలయంలో వైభవంగా

అన్నకూటోత్సవం



అన్నకూటోత్సవ పూజలు చేస్తున్న అర్చకులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయంలో బుధవారం అన్నకూటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అక్షయ తృతీయ రోజున ఈ కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమానికి కార్వేటినగరానికి చెందిన పట్టాభి నాయుడు దాతగా వ్యవహరించారు. ఉదయం ఆలయంలో వరదరాజస్వామికి పసనంగా అభిషేకం నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలకు విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాల ఎదుట అన్న ప్రసాదాన్ని రాశిగా పోసి పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, దాతలు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు





అమ్మపల్లిలో, చవటగుంటలో అర్జున తపస్సు కార్యక్రమం

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం జరిగింది. ఆలయ ఆవరణలో తపస్మాన్ ఏర్పాటు చేశారు. అర్జున వేషధారి అర్జున తపస్సుతో పాశుపతాస్త్రం దక్కించుకునే మెట్లన్ని ప్రదర్శిస్తూ.. తపస్మానం అధిరోహించారు. ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మారేపల్లికి చెందిన బండి రాయలరెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

● కార్వేటినగరం మండలం అమ్మపల్లి మహాభారత ఉత్సవాల్లో బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా అర్జున వేషధారి పాశుపతాస్త్రం కోసం తపస్మానం అధిరోహించే మెట్లను ప్రదర్శించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా అమరావతి పునఃప్రారంభ పనులు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రంగ రంగ వైభవంగా అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభమవుతున్నాయని టీడీపీ నేతలు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వేరువేరుగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశాల్లో నేతలు మాట్లాడుతూ అమరావతి రైతుల త్యాగాలను అవమానపరిచి, అమరావతిని నిర్వీర్యం చేసినందుకే వైఎస్ జగన్‌రెడ్డి, వైసీపీ అధఃపాతాళానికి పడిపోయిందని అన్నారు. అమరావతి రైతుల బలిదానం వల్ల ఈరోజు రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభమవుతున్నాయని చెప్పారు. ఇందుకుగాను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 1631 రోజులు నిర్విరామంగా పోరాటం చేసిన అమరావతి రైతులు, ఆదివరకు 230 మంది పైగా రైతులు ప్రాణ త్యాగం చేసి అమరావతిని తిరిగి నిలబెట్టారని, వారి రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు మూడు రాజధానుల నినాదాన్ని పక్కనపెట్టి, అమరావతి రాజధానికి మద్దతు పలకాలని సూచించారు. మే 2వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన, పునర్నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అవన్నీ దిగ్విజయంగా జరగాలని కోరుకుంటున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు మోహన్ రాజ్, మేషాక్, దరణి ప్రకాష్ పాల్గొన్నారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ఎండ తీవ్రత రోజురోజుకు అధికంగా ఉంటుందని, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి భూ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సర్వేయర్లను, వీఆర్వోలను ఆదేశించారు. వీఆర్‌వోలు గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఎండ ఎక్కువ కావడంతో పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా బయట తిరగరాదన్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలను బావులు, చెరువుల వద్దకు పంపరాదని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని ఆయన చెప్పారు.

దేవరకొండపై జలకంఠేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్ దంపతులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మొగిలీశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా దేవరకొండపై ఉన్న జలకంఠేశ్వర స్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం యజమాన సంకల్పం, అనుజ్ఞ, మహాగణపతి హోమం, కలశ పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్ దంపతులు వ్యవహరించారు.

వైభవంగా గంగమ్మ జాతర



వెదురుకుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేట పంచాయతీ రాజులకండ్రిగలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చారు. ఈ క్రమంలో మహా కుంభోజ్వ సాదువులు వేషధారణ చూపరులను ఆకర్షించింది.

శ్రీశ్రీ జయంతి



కేక్ కట్ చేస్తున్న గిరిబాబు

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) జయంతి కార్యక్రమం బుధవారం కార్వేటినగరంలో శ్రీకామేశ్వర జిల్లా అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో జరిగింది. కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. శ్రీశ్రీ సాహితీ రంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి



విజయ్ మృతదేహం

గుడిపాల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి చెందారు. బుధవారం రాత్రి కమ్మతిమ్మపల్లె పంచాయతీ చలిదేపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచి విజయ్(54) కమ్మతిమ్మపల్లెలో జరుగుతున్న సంతలో కూరగాయలు కొనడానికి వెళ్లారు. ఉన్నట్టుండి సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు 190 రామాపురం సీఎంసీలో చేర్పించారు. అప్పటికే ఆయన మృతి చెందారని వైద్యులు తెలిపారు.

వైభవంగా గంగమ్మ కుంభాభిషేకం



గురజాల చెన్నకేశవులు నాయుడిని సత్కరిస్తున్న అర్చకులు

గుడిపాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాల పంచాయతీ ముత్యాలమ్మపల్లెలో బుధవారం గంగమ్మ కుంభాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంచారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలకు స్వీకారం కోడి



స్వీకారం కోడి కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం జక్కిదొన మహాభారత ఉత్సవాలు జరపడానికి ముందస్తుగా జరిగే స్వీకారం కోడి కార్యక్రమాన్ని ద్రౌపది అమ్మవారి ఆలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త భీమనేని మాధవ నాయుడు పర్యవేక్షించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లిమిట్ట గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు రంగనాథరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం మాజీ డిప్యూటీసీఎం నారాయణస్వామి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జయచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, గురవారెడ్డి, విజయకుమార్, శ్యామ్‌రాజ్, జనార్దన్, సుబ్బు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం అన్నదానం జరిగింది. దాత కొత్తపల్లి భాస్కరయ్య నివాసంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

చౌడేపల్లె, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం లో భక్తులకు అన్నదానం చేయడానికి బుధవారం రూ. 2,04,375 విరాళం అందినట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. మదనపల్లెకు చెందిన మురళీనాయుడు, గిరిజ దంపతులు రూ.1,34,675 విరాళం అందించగా, వెంకటశివారెడ్డి, పందరత్నమ్మలు రూ.50 వేలు, బెంగళూరుకు చెందిన గంగరాజు 20 వేలు అందజేసారని పేర్కొన్నారు.

మనోవేదనతో వ్యాపారి ఆత్మహత్య

గంగవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మనోవేదనతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గంగవరం మండలంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలం మారేడుపల్లె గ్రామానికి చెందిన వెంకటేష్ ఫొటో ఫ్రేమ్‌లు పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడు నెలల క్రితం వెంకటేష్ కుమారుడు కిరణ్ బీటెక్‌లో కరాటేలో గోల్డ్ మెడల్ సాధించాడు. అయితే కొద్ది రోజులకే కిరణ్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. కుమారుడు మృతి చెందినప్పటి నుంచి వెంకటేష్ బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వెంకటేష్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఇంతలోనే గ్రామసమీపంలోని కౌండిన్య కాలువ వద్ద ఓ చింతచెట్టుకు వేలాడుతూ కనిపించాడు. గ్రామస్థులు కుటుంబ సభ్యులు చేరుకోగానే అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.